క్లుప్తంగా

దరఖాస్తులాహ్వానం

సీతంపేట: మండలంలోని మల్లి పీవీటీజీ గురుకుల పాఠశాలలో పలు తరగతుల్లో ప్రవేశాలకు గాను దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీవో సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి ఓ ప్రకటనలో శుక్రవారం కోరారు. మూడో తరగతిలో 80, నాలుగో తరగతిలో 16, ఐదో తరగతిలో 10, ఆరో తరగతిలో 1, ఏడో తరగతిలో 3, ఎనిమిదో తరగతిలో 6, తొమ్మిదో తరగతిలో 7 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, జూన్ 4వ తేదీ లాటరీ ద్వారా విద్యార్థుల ఎంపిక, సీట్లు కేటాయింపు ఉంటుందన్నారు.

అర్హుల జాబితా సిద్ధం..

భామిని: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో 2025–26విద్యా సంవత్సరానికి సంబంధించి, ఆరో తరగతిలో ప్రవేశాలకు అర్హుల జాబితా సిద్ధం చేసి ప్రచురించినట్లు ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్ ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఏప్రిల్ 21వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తుండగా, ఫలితాల ఆధారంగా రిజర్వేషన్ల ప్రకారం విద్యార్థుల ఎంపిక జరిగిందన్నారు.

భక్తిశ్రద్ధలతో నోములు

భామిని: మండలంలోని సింగిడి గ్రామంలో సువాసిని నోములు శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఆచరించారు. వివాహితులు 108 మంది ముత్తయిదవులకు వాయినాలు అందించి, ఆశీర్వచనాలు పొందారు. పవిత్ర వైశాఖమాసంలో పెళ్లయిన ఆడవాళ్లు ఇలా ఈ నోము చేయడం ఆనవాయితీగా వస్తోంది.

పాలకొండ రూరల్: స్థానిక కాశీవిశ్వేశ్వరాలయంలో జరుగుతున్న మేధా దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం విగ్రహాలకు కలశాభిషేకం నిర్వహించారు. మహిళలంతా కలశాలలతో తీసుకువచ్చిన పవిత్ర నదీజలాలతో విగ్రహాలకు అభిషేకం చేశారు.

విపత్తుల సమయంలో మెలకువలు పాటించాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రసన్నకుమార్

సీతానగరం: ప్రకృతి విపత్తులు వచ్చినప్పుడు జరిగే ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించుకోవాలని తహసీల్దార్ ప్రసన్నకుమార్ అన్నారు. ఏపీ విపత్తుల నివారణ సంస్థ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు, స్థానిక పెద్దలకు అవగాహన సదస్సు శుక్రవారం కొత్తవలస డ్యామ్‌వద్ద జరిగింది. ఆయన మాట్లాడుతూ విపత్తులు వచ్చినప్పుడు సువర్ణముఖి నదిపై కొత్తవలస డ్యామ్ వద్ద ప్రమాదాలు ఏవిధంగా జరుగుతున్నాయి? ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు.అలాగే రోడ్డు ప్రమాదాలు, వంటగ్యాస్ సిలిండర్లతో ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజలు మెలకువలు పాటించి ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ప్రమాదంలో ఇరుక్కున్న వారిని రక్షించడానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అనంతరం మక్కువ మండలం వెంకటభైరిపురం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రజలకు విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పార్వతీపురం రూరల్ సీఐ గోవిందరావు, ఇన్‌చార్జ్ ఎస్సై నీలకంఠం, జిల్లాఫైర్ ఆఫీసర్ కె.శ్రీనుబాబు పాల్గొన్నారు.

సచివాలయ సర్వేలను త్వరగా పూర్తిచేయాలి

బలిజిపేట: సచివాలయ సర్వేలను త్వరగా పూర్తిచేయాలని సీఈఓ సత్యనారాయణ కోరారు. ఈ మేరకు బలిజిపేట ఎంపీడీఓ కార్యాలయంలో కార్యదర్శులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాల పరిధిలో నిర్వహిస్తున్న సిటిజన్ ఈకేవైసీ, చిన్నారుల ఆధార్ గురించి, మన మిత్రలపై రివ్యూ సమావేశం నిర్వహించారు. నిర్ధారించిన ప్రకారం సర్వేలు నిర్వహించడంలో వెనుకబడి ఉన్నవారు త్వరగా పూర్తిచేయాలని సూచించారు. సచివాలయాల వారీగా రివ్యూ నిర్వహించి ఎందుకు పూర్తిచేయలేదని ప్రశ్నించారు. ఎటువంటి సమస్యలు ఉన్నా వెంటనే పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఏఓ త్రినాథరావు, ఎంపీడీఓ నగేష్, ఈఓపీఆర్‌డీ పుష్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆపరేషన్ కాగార్‌ను నిలిపివేయాలి

పార్వతీపురం టౌన్: ఆపరేషన్ కాగార్‌ను నిలిపివేయాలని సీపీఐ న్యూ డెమొక్రసీ జిల్లా కార్యదర్శి పోలా ఈశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కాగార్ ఆపరేషన్ పేరుతో కేంద్ర ప్రభుత్వం మధ్యభారతం ఆదివాసీలపై యుద్ధం ప్రకటించిందన్నారు. ఆదివాసీలు నివసిస్తున్న కర్రెగుట్ట ప్రాంతంలో విలువైన ఖనిజాలు ఉన్నాయని, వాటిని అదానీ, అంబానీ, మిట్టల్, వేదాంత వంటి కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడానికి కేంద్రం పూనుకుంటోందని ఆరోపించారు. ఆదివాసీలకు అండగా ఉన్న మావోయిస్టులను అంతమొం దించడానికి కేంద్రప్రభుత్వం పూనుకుంటోందని, ఒకపక్క కేంద్ర ప్రభుత్వంతో చర్చలకు సిద్ధంగా ఉన్నామని మావోయిస్టు పార్టీ లేఖలు రాసినా పట్టించుకోకుండా వారిని హతమార్చే లక్ష్యంతో సైనిక బలగాలు వెంటాడుతున్నాయన్నారు. ఎం.గోపాలం ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి, పి.రమణి, పీఓడబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, అఖిల భారత రైతు కూలీ జిల్లా ఉపాధ్యక్షులు పాల్గొన్నారు.

అధ్వానంగా రోడ్లు.. జనం అవస్థలు!


గుమ్మలక్ష్మీపురం(కురుపాం): గుమ్మలక్ష్మీపురం మండలంలో రాళ్లు తేలిన కళగొట్టు గ్రామ రోడ్డు


గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలంలోని ఉదయపురం రోడ్డు ఇలా..

కొమరాడ మండలంలో పార్వతీపురం నుంచి కూనేరుకు వెళ్లే రోడ్డు దుస్థితి



సీతంపేట: బురదనీటితో సీతంపేట మండలంలోని అంటికొండ-సామరెల్లి రోడ్డు

రోడ్లు అధ్వానంగా ఉండడంతో జనం అవస్థలు పడుతున్నారు. దారి పొడవునా గుంతలు, పైకి తేలిన రాళ్లే కనిపిస్తున్నాయి. రోడ్ల మీదుగా ప్రయాణించాలంటే నరకయాతన పడుతున్నారు. ఎన్నికలప్పుడు తామొస్తే గుంతలు లేని రోడ్లు వేసి చూపిస్తామని ప్రగల్భాలు పలికిన కూటమి నాయకులు.. అధికారంలోకి రాగానే చేతులెత్తేశారు. కొన్నిచోట్ల అరకొరగా రోడ్లు మరమ్మతులు చేసేసి మిగతా పాడైన రోడ్లను పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తీరుపై ప్రజలు మండిపడుతున్నారు. కొత్త రోడ్లు వేస్తారని అందలం ఎక్కిస్తే ఏం చేస్తున్నారని నిలదీస్తున్నారు. ఇప్పటికైనా రోడ్లు కూడా బాగు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

–సీతంపేట/గుమ్మలక్ష్మీపురం(కురుపాం)

వైఎస్సార్ సీపీ మండల కమిటీ నియామకం

గరుగుబిల్లి: వైఎస్సార్ సీపీ మండల కమిటీ నియామకం జరిగింది. ఈ మేరకు పార్టీ కేంద్రం కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియమితులైన కమిటీ సభ్యుల వివరాలిలా..

హోదా	పేరు		
		కార్యదర్శి	అశోక్‌కుమార్ బ్రహ్మ
		కార్యదర్శి	రౌతు రామినాయుడు
		కార్యదర్శి	గొట్టాపు సత్యనారాయణ
		కార్యదర్శి	ఆవాల కన్నయ్య
		కార్యనిర్వాహక సభ్యుడు	పాల సాయిరాం
		కార్యనిర్వాహక సభ్యుడు	చింతల ఉమాశంకరరావు
వైస్ ప్రెసిడెంట్	ముదిలి గౌరునాయుడు	కార్యనిర్వాహక సభ్యుడు	దాసరి శ్రీనివాసరావు
వైస్ ప్రెసిడెంట్	గల్లిపల్లి శ్రీనివాసరావునాయుడు	కార్యనిర్వాహక సభ్యుడు	బూరి రమేష్‌నాయుడు
ప్రధాన కార్యదర్శి	గుంట్రెడ్డి సత్యనారాయణ	కార్యనిర్వాహక సభ్యుడు	నక్కిట్ల చిన్నారావు
ప్రధాన కార్యదర్శి	వాకాడ కూరిమినాయుడు	కార్యనిర్వాహక సభ్యుడు	మర్రాపు కృష్ణమూర్తి
ప్రధాన కార్యదర్శి	అల్లు లక్ష్మీనారాయణ	కార్యనిర్వాహక సభ్యుడు	గంట సింహాచలంనాయుడు
ప్రధాన కార్యదర్శి	మరడాన వెంకటనాయుడు	కార్యనిర్వాహక సభ్యుడు	మార్కొండ ఆనందరావు

● **జియ్యమ్మవలస రూరల్:** వైఎస్సార్ సీపీ మండల కమిటీ నియామకం జరిగింది. ఈ మేరకు పార్టీ కేంద్రం కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియమితులైన కమిటీ సభ్యుల వివరాలిలా..

హోదా	పేరు		
		ఎగ్జిక్యూటివ్ మెంబర్	కేతిరెడ్డి సూర్యారావు
వైస్ ప్రెసిడెంట్	నిమ్మక గణేష్	ఎగ్జిక్యూటివ్ మెంబర్	బొబ్బిలి చిన్నారావు
వైస్ ప్రెసిడెంట్	పాలవలస శివనారాయణ	ఎగ్జిక్యూటివ్ మెంబర్	దిగుముద్ర ఆదినారాయణ
జనరల్ సెక్రటరీ	మర్రాపు తాతబాబునాయుడు	ఎగ్జిక్యూటివ్ మెంబర్	తట్టికోట రాంబాబు
జనరల్ సెక్రటరీ	వాన గోపాలరావు	ఎగ్జిక్యూటివ్ మెంబర్	గుంట్రెడ్డి వాసుదేవరావు
జనరల్ సెక్రటరీ	పొడుగు దొర	ఎగ్జిక్యూటివ్ మెంబర్	బడే కేశవరావు
జనరల్ సెక్రటరీ	రెడ్డి అన్నపూర్ణమ్మ	ఎగ్జిక్యూటివ్ మెంబర్	చాదాడ రామకృష్ణ
సెక్రటరీ	మరడాన సింహాచలం	ఎగ్జిక్యూటివ్ మెంబర్	షన్ముఖ
సెక్రటరీ	యు.వెంకటరమణ	ఎగ్జిక్యూటివ్ మెంబర్	పారల చిన్నబాబు
సెక్రటరీ	బలివాడ తవిటినాయుడు	ఎగ్జిక్యూటివ్ మెంబర్	బెజ్జిపురపు మురళి
సెక్రటరీ	బంకురు రాంబాబు	ఎగ్జిక్యూటివ్ మెంబర్	చందక సింహాచలం
ఎగ్జిక్యూటివ్ మెంబర్	బిడ్డిక భూషణరావు	ఎగ్జిక్యూటివ్ మెంబర్	పిప్పల అప్పలనాయుడు
ఎగ్జిక్యూటివ్ మెంబర్	వంగల సింహాచలం	ఎగ్జిక్యూటివ్ మెంబర్	అడ్డాకుల కోరయ్య
ఎగ్జిక్యూటివ్ మెంబర్	లోలుగ గోపాలరావు		

మాజీ సర్పంచ్ మృతి



కొమరాడ: మండలంలోని ఆర్తాం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ బెలగాపు సంగంనాయుడు శుక్రవారం మృతి చెందారు. ఆయన మృతికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సంతాపం ప్రకటించారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన మృతి పార్టీకి తీరనిలోటు అని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని వేడుకున్నారు.

వితరణ


ఆక్సిజన్ సిలిండర్ అందిస్తున్న దాతలు

పాలకొండ రూరల్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి పట్టణంలోని నెయ్యిల వీధికి చెందిన పండూరు శ్రీనివాసరావు, కృష్ణలు ఓ ఆక్సిజన్ సిలిండర్, ఇతర సామగ్రి వితరణ చేశారు. వాటిని ఆస్పత్రి సూపరింటెండెంట్ జి.నాగభూషణరావుకు శుక్రవారం అందజేశారు. తమ తండ్రి పండూరు శంకరాచారి జ్ఞాపకార్థం వాటిని దానం చేసినట్లు దాతలు తెలిపారు. రానున్న రోజుల్లోనూ ఆస్పత్రి అభివృద్ధికి మరింత సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ సోఫియా సౌదామిని, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు

పాలకొండ రూరల్: నగరపంచాయతీ పరిధిలోని కోమటిపేటలో పారిశుధ్య పనులు శుక్రవారం చేపట్టారు. కౌన్సిలర్ కోడెం విజయకుమార్ పర్యవేక్షణలో వీధి కాలువలు, రోడ్లపై నిలిచిన మురుగు, చెత్తాచెదారం తొలగించారు. ఇదిలా ఉండగా, శివారు వీధుల్లో నెలకొన్న మురుగు తొలగింపు పనులను పారిశుధ్య సిబ్బందితో నగర కమిషనర్ రత్నం చేయించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు.

ఉద్యోగోన్నతి


ఉద్యోగోన్నతి ఉత్తర్వులు స్వీకరిస్తున్న సాంబశివరావు

గుమ్మలక్ష్మీపురం: స్థానిక జీసీఎంఎస్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.సాంబశివరావుకు సీనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతి లభించింది. ఈ మేరకు విశాఖపట్నం లోని జీసీసీ మేనేజింగ్ డైరెక్టర్ కార్యాలయం వద్ద ఎండీ కల్పనాకుమారి సమక్షంలో జీసీసీ చైర్మన్ శ్రావణ్‌కుమార్ చేతులమీదుగా ఉద్యోగోన్నతి ఉత్తర్వులు శుక్రవారం స్వీకరించారు.

ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలి


నిరుద్యోగ యువతను ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్యామ్‌బాబు

పాలకొండ రూరల్: ఉపాధి అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్యామ్‌బాబు ఆకాంక్షించారు. కళాశాలలో శుక్రవారం జరిగిన జాబ్‌మేళాకు హాజరైన నిరుద్యోగ యువతను ఉద్దేశించి, ఆయన కాసేపు ప్రసంగించారు. వచ్చిన అవకాశం చిన్నదైనా అందుకోవాలని, ఆ చిన్న అవకాశంతోనే ఉన్నత స్థానాలు సాధించవచ్చన్నారు.

జవహర్ నాలెడ్జ్ సెంటర్, డీవీస్, జిల్లా ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఈ మేళాకు 41 మంది హాజరుకాగా వివిధ ఉద్యోగాలకు 10 మంది ఎంపికయ్యారు. కార్యక్రమంలో కంపెనీల ప్రతినిధులు సీహెచ్ పూర్ణప్రసాద్, బి.పూర్ణచంద్ర, అజయ్‌కుమార్, వైస్ ప్రిన్స్‌పాల్ బి.జయమణి తదితరులు పాల్గొన్నారు.

212 హైరిస్క్ మలేరియా గ్రామాల్లో.. దోమల నివారణ మందు పిచికారీ


దోమల నివారణ మందు స్ప్రే చేస్తున్న దృశ్యం

సీతంపేట: ఐటీడీఏ పరిధిలోని 212 హైరిస్క్ మలేరియా గ్రామాల్లో దోమల నివారణ మందు పిచికారీ చర్యలు చేపడుతున్నట్లు శ్రీకాకుళం డీఎంవో పీవీ సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. ప్రస్తుతం కోసంగి, బూర్జగూడ గ్రామాల్లో దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. వైద్య సిబ్బంది పూర్తి స్థాయిలో పర్యవేక్షించి, స్ప్రేయింగ్ సక్రమంగా జరిగేలా చూడాలన్నారు.

మండలంలోని కురసింగి గ్రామంలో విషజ్వరాలు ప్రబలుతున్నాయి. పలువురు మలేరియా బారినపడి బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో దోమకాటుకు గురికాకుండా మలేరియా నివారణ మందు స్ప్రే చేశారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి


రక్షిత మంచినీటి పథకం నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ మధుసూదనరావు

పాలకొండ రూరల్:

మండలంలోని లుంబూరు సమీపంలో గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదలకు మంజూరు చేసిన ఇళ్ల కాలనీ వద్ద మౌలిక వసతుల కల్పనను ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ మధుసూదనరావు, ఏఈ ప్రవళికలు శుక్రవారం పరిశీలించారు. నిర్మాణ దశలోని రక్షిత మంచినీటి పథకాన్ని చూసి, త్వరితగతిన నిర్మాణం పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని వారు సంబంధిత అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. ప్రజలకు అవసరమైన కనీస సదుపాయాలు ఉండేలా చూడాలన్నారు.

గొడౌన్లను అందుబాటులోకి తీసుకురావాలి


పద్మాపురంలో గొడౌన్ల పరిశీలనలో సబ్‌కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి

పాలకొండ: మండలంలోని అర్దలి, పద్మాపురం గ్రామాల వద్ద గొడౌన్ల నిర్మాణాలను సబ్‌కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. త్వరితగతిన ఆయా భవనాలను అందుబాటులోకి తీసుకురావాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎరువులు, విత్తనాలు, గన్నీ బ్యాగుల కోసం గొడౌన్లు వినియోగించాలని కోరారు. ఆయన వెంట తహసీల్దారు బాలమురళీకృష్ణ ఉన్నారు.

తాగునీటికి అవస్థలు


మంచినీరు లేని తాగునీటి ట్యాంకు

కొమరాడ: మండలంలోని దేరుపాడు గిరిజన గ్రామంలోని తాగునీటి ట్యాంకు మూలకు చేరింది. ఇటీవల వీచిన భారీగాలులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో తాగునీటి ట్యాంకులోకి నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో తాగునీటి కోసం గ్రామంలోని 28 గిరిజన కుటుంబాల వారు అవస్థలు పడుతున్నారు. అలాగే ట్యాంకుకు నీటిని అందించే బావి కూడా ఎండిపోయిందని, తాగునీరు సక్రమంగా అందడం లేదని వాపోతున్నారు. గ్రామానికి తాగునీటి బోరు మంజూరు చేయాలని కోరుతున్నారు.

ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు


తోటపల్లి ఆలయ భూములను సర్వే చేస్తున్న సిబ్బంది

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి వీవీ సూర్యనారాయణ తెలిపారు. దేవస్థానానికి సంబంధించిన భూములను సర్వేయర్లతో శుక్రవారం సర్వే చేయించారు. ఆలయ పరిసరాల్లోని కొంతభూమి ఆక్రమణకు గురైందని, ఆ ప్రాంతంలో అక్రమ నిర్మాణాలు జరిగాయని కలెక్టర్‌కు గ్రామంలోని కొంతమంది ఫిర్యాదులు చేసిన నేపథ్యంలో ఈ సర్వే చేపట్టారు. సర్వేపై నివేదిక వచ్చిన తర్వాత ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తుది నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని ఈవో తెలిపారు. కార్యక్రమంలో టీటీడీ ట్రస్టు సభ్యులు తామాడ దుర్గారావు, శంబంగి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనుల నాణ్యతపై దర్యాప్తు చేపట్టాలి


మాట్లాడుతున్న గిరిజనాభ్యుదయ సంఘ అధ్యక్షుడు చంద్రశేఖర్

జియ్యమ్మవలస: గిరిజన ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల నాణ్యతపై దర్యాప్తు చేపట్టాలని ఆదివాసీ గిరిజనాభ్యుదయ సంఘం అధ్యక్షుడు అరిక చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఇదే విషయమై అయన మండలంలోని రావాడ గ్రామంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల ద్వారా చేస్తున్న కొత్త రోడ్ల నిర్మాణం, పాత రోడ్ల మరమ్మతులు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల ప్రహరీల నిర్మాణంలో నాణ్యత లోపించడమే కాకుండా తూతూమంత్రంగా పనులు కొనసాగుతున్నాయని ఆరోపించారు. ఆయా పనులపై అధికారుల సరైన పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా నిర్మాణాల నాణ్యతపై పూర్తిస్థాయి దర్యాప్తు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

వర్షపునీరు తొలగించాలి


ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకుడు సాంబమూర్తి

కొమరాడ:

గుమడ రైల్వేస్టేషన్ సమీపంలోని రైల్వే అండర్ పాస్‌వేలో ఉండిపోయిన వర్షపునీటిని తొలగించాలని సీపీఎం నాయకుడు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు.

అండర్ పాస్‌వే దగ్గర భారీ స్థాయిలో నీరు నిల్వ ఉండిపోయిన చోట శుక్రవారం ఆందోళన చేపట్టిన అనంతరం స్టేషన్ అధికారి శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. నీరు అలాగే ఉండిపోవడం వల్ల పాదచారులు వెళ్లలేకపోతున్నారని, దోమలు కూడా పెరిగే అవకాశం ఉందని అన్నారు. తక్షణమే మోటారు వినియోగించి, నీరు తొలగించే చర్యలు తీసుకోవాలన్నారు.

కిశోరి వికాసంపై అవగాహన ర్యాలీ


జియ్యమ్మవలస రూరల్: కిశోరి వికాసంపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు


వీరఘట్టం: బాలికలకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ పీవో సిమ్మాలమ్మ

వీరఘట్టం: కిశోరి బాలికలంతా తప్పనిసరిగా ఆరోగ్య సూత్రాలు పాటించాలని ఐసీడీఎస్ పీవో బి.సిమ్మాలమ్మ సూచించారు. మండలంలోని నడిమికెల్ల, కంబర, నడుకూరు గ్రామాల్లో కిశోరి బాలికల వికాసంపై శుక్రవారం అవగాహన ర్యాలీ, సదస్సు నిర్వహించారు. కౌమారదశలో బాలికల్లో వచ్చే మార్పులు, పాటించాల్సిన వ్యక్తిగత పరిశుభ్రత, సమాజంలో ప్రవర్తించాల్సిన విధానం వంటి అంశాలను ఆమె వివరించారు. మెరుగైన ఆరోగ్యానికి ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాజేశ్వరి, జ్ఞానమ్మ పాల్గొన్నారు.

కొమరాడ: మండలంలోని గంగారేగువలస, కొమరాడ తదితర గ్రామాల్లో కిశోరి బాలికల వికాసంపై అవగాహన కల్పిస్తూ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో 11 ఏళ్లు పైబడిన బాలికల దగ్గర నుంచి 18 ఏళ్ల వయసు వచ్చే వారందరికీ జూన్ 10వ తేదీ విద్య ప్రాముఖ్యత, ఆరోగ్యం, రుతుచక్రం-శుభ్రత, పౌష్టికాహారం ప్రయోజనాలు, మానవ అక్రమ రవాణా నిర్మూలన, బాల్యవివాహాల నిషేధం, సైబర్ నేరాల బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించనున్నామని ఎంపీడీవో మల్లిఖార్జునరావు తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

గరుగుబిల్లి: కిశోరి బాలికల వికాసంపై అవగాహన కల్పిస్తూ మండల కేంద్రంలో శుక్రవారం ర్యాలీ చేపట్టారు. 11 ఏళ్ల నుంచి 18 ఏళ్ల వయసు బాలికలకు విద్య, ఆరోగ్యం, భద్రత, ఆర్థిక స్వావలంబన మెరుగుపరచడమే ప్రధాన ఉద్దేశంగా ఈ కార్యక్రమం జూన్ 10వ తేదీ వరకు కొనసాగుతుందని ఎంపీడీవో జి.పైడితల్లి, ఐసీడీఎస్ పీవో జి.సుగుణకుమారి తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

జియ్యమ్మవలస(రూరల్): మండలంలోని చినకుదమ గ్రామంలో కిశోరి బాలికల వికాసంపై శుక్రవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం గంగమ్మ, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


కొమరాడలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీవో మల్లిఖార్జునరావు తదితరులు

గరుగుబిల్లి: అవగాహన ర్యాలీలో ఎంపీడీవో పైడితల్లి, ఐసీడీఎస్ సిబ్బంది
